# రైల్ వే ల ప్రాజెక్టులు రెండిటిని మరియు ఎన్ఐసిడిసి ప్రాజెక్టులు ఆరిటిని మదింపు చేసిన ఎన్ పిజి

న్యూఢిల్లీ, జూన్ 29 :నెట్ వర్క్ ప్లానింగ్ గ్రూపు (ఎన్‌పిజి) యొక్క 73 వ సమావేశాన్ని న్యూ ఢిల్లీ లో 2024 జూన్ 21 వ తేదీ న నిర్వహించడమైంది. ఈ సమావేశానికి డిపార్ట్ మెంట్ ఫార్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రి ఎండ్ ఇంటర్‌నల్ ట్రేడ్ (డిపిఐఐటి) అడిషనల్ సెక్రెట్రి శ్రీ రాజీవ్ సింహ్ ఠాకుర్ అధ్యక్షత వహించారు. ఎనిమిది ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ను మూల్యాంకనం చేయడం పైన ఈ సమావేశం లో దృష్టి ని కేంద్రీకరించడమైంది. ఈ ఎనిమిది ప్రాజెక్టుల లో రెండు రైల్ వే ల మంత్రిత్వ శాఖ (ఎమ్‌ఒఆర్) కు చెందిన ప్రాజెక్టులు రెండు, డిపిఐఐటి లోని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసిడిసి)కు చెందిన ప్రాజెక్టు లు ఆరు ఉన్నాయి.

రైల్ వే ల మంత్రిత్వ శాఖ కు చెందిన ఒకటో ప్రాజెక్టు మహారాష్ట్ర లోని నాసిక్ మరియు జల్ గావ్ జిల్లాల లో మన్ మాడ్ నుండి జల్ గావ్ వరకు 160 కిలో మీటర్ ల పొడవైన నాలుగో బ్రాడ్ గేజ్ రైల్ వే లైను నిర్మాణాని కి సంబంధించింది. 2,594 కోట్ల రూపాయల అంచనా పెట్టుబడి తో తలపెట్టిన ఈ ప్రాజెక్టు ఇప్పటికే ఉన్న మార్గం యొక్క సెక్షన్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా సరకు రవాణా రైళ్లతో పాటు ప్రయాణికుల రైళ్ళు కూడా వాటి రాకపోకల ను సాఫీ గా సాగించేందుకు తోడ్పడనుంది. ఈ ప్రాజెక్టు జాతీయ మౌలిక సదుపాయాల కల్పన సంబంధి ప్రాథమ్యాల కు అనుగుణం గాను మరియు ఆ ప్రాంతం లో భావి కాలపు రవాణా అవసరాల ను తీర్చడానికి కీలకమైంది గాను ఉంది.

రైల్ వే ల మంత్రిత్వ శాఖ కు చెందిన రెండో ప్రాజెక్టు మహారాష్ట్ర లోని జల్ గావ్ జిల్లా భుసావల్ నుండి మధ్య ప్రదేశ్ లోని బుర్ హాన్ పుర్, ఇంకా ఖండ్ వా జిల్లాల వరకు 130.5 కిలో మీటర్ ల మేర మూడో మరియు నాలుగో బ్రాడ్ గేజ్ రైల్ వే లైన్ ల నిర్మాణాని కి సంబంధించింది. 3,285 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో కూడిన ఈ ప్రాజెక్టు సదరు సెక్షన్ యొక్క సామర్థ్యాన్ని గణనీయం గా పెంచడం తో పాటు ప్రాంతీయ అభివృద్ధి ని ప్రోత్సహించడం మరియు లాజిస్టిక్స్ రంగం లో భారతీయ రైల్ వే ల యొక్క బజారు వాటా ను వృద్ధి చేయడం ద్వారా ఆ ప్రాంతం లో ఆర్థిక ఎదుగుదల కు మరియు చిరకాలం మన్నేటటువంటి రవాణా అవసరాల ను తీర్చడాని కి దోహదం లభించనుంది.

ఈ రెండు ప్రాజెక్టు లు బొగ్గు, సిమెంటు మరియు ఖనిజాల ఉత్పత్తి రంగాల కు కనెక్టివిటీ ని అందించడం కోసం రైల్ వే ల మంత్రిత్వ శాఖ సంకల్పించిన ఎనర్జీ మినరల్ సిమెంట్ కారిడర్ (ఇఎమ్ సిసి) కార్యక్రమం లో ఓ భాగం గా ఉన్నాయి.

ఎన్ఐసిడిసి యొక్క నాలుగు ప్రాజెక్టు లు ఉత్తర్ ప్రదేశ్ లోని ఆగ్రా మరియు ప్రయాగ్ రాజ్ లలో, హరియాణా లోని హిసార్ లో, ఇంకా బిహార్ లోని గయ లో ఇంటిగ్రేటెడ్ మేన్యుఫేక్చరింగ్ క్లస్టర్స్ (ఐఎమ్‌సి స్) ను అభివృద్ధి పరచడానికి సంబంధించినవి. వీటి అంచనా పెట్టుబడి 8,175 కోట్ల రూపాయలు. ఈ ప్రాజెక్టు ల ఉద్దేశ్యం విద్య పరమైనటువంటి మరియు ఆరోగ్య సంరక్షణ ప్రధానమైనటువంటి సేవల ను కల్పించడం తో పాటు గా స్మార్ట్ టెక్నాలజీస్, లాజిస్టిక్స్, నివాస సదుపాయాలు, వాణిజ్య సదుపాయాలు సహా ఇండస్ట్రి 4.0 ప్రమాణాల కు తుల తూగే అత్యాధునిక తయారీ కేంద్రాల ను అభివృద్ధి పరచాలన్నదే. ఇ-మొబిలిటీ, ఫూడ్ ప్రాసెసింగ్, ఎఫ్ఎమ్ సిజి, తోలు, దుస్తులు వంటి రంగాల అవసరాల ను ఈ ఐఎమ్‌సి లు తీరుస్తాయి.

ఎన్ఐసిడిసి కే చెందిన రెండు ప్రాజెక్టుల లో ఆంధ్ర ప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో గల ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతం మరియు వైఎస్ఆర్ కడప జిల్లా లోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతం ల యొక్క అభివృద్ధి కలసి ఉన్నాయి. వీటి అంచనా పెట్టుబడి 5,367 కోట్ల రూపాయలు. పరిశ్రమల ను ఆకర్షించడం కోసం ఉన్నతమైన మౌలిక సదుపాయాల ను ఏర్పరచాలన్నది ఈ ప్రాజెక్టుల యొక్క ఉద్దేశ్యంగా ఉంది. ఈ ప్రాజెక్టు లు ప్రధాన రాజమార్గాలు, రైల్ వే లైన్ లు మరియు నౌకాశ్రయాల కు సమీపం లో నెలకొన్నాయి. సామాజిక-ఆర్థిక పురోగతి కి దన్నుగా నిలవడం తో పాటు ఉద్యోగ అవకాశాల ను గణనీయం గా కల్పించడం ఈ ప్రాజెక్టుల లక్ష్యం గా ఉంది.

సమావేశం కొనసాగిన క్రమం లో, అన్ని ప్రాజెక్టుల ను వాటి సమీకృత ప్రణాళిక రచన పరం గాను మరియు పిఎమ్ గతిశక్తి సూత్రాల కు అనుగుణం గాను మూల్యాంకనం చేయడమైంది. సామాజిక-ఆర్థిక లాభాలు, మెరుగైన సంధానం, రవాణా ఖర్చుల లో తగ్గింపు మరియు సామర్థ్యాన్ని పెంచడం అనే అంశాల పైన శ్రద్ధ ను తీసుకోవడమైంది.

పారిశ్రామిక వృద్ధి కి ఊతాన్ని ఇస్తూ, పోటీతత్వాన్ని పెంచి మరి దేశ ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల సాధన లో చెప్పుకోదగిన విధం గా తోడ్పాటు ను అందించడానికి సిద్ధం గా ఉన్నటువంటి కనెక్టివిటీ ని మెరుగు పరచడం లోను, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంపొందింప చేయడం లోను, ఇంకా యావత్తు భారతదేశం లో ఉన్నత స్థాయి తయారీ సంబంధి ఇకోసిస్టమ్స్ ను నెలకొల్పడం లోను ఈ ప్రాజెక్టు లు ముఖ్యమైన పాత్ర ను పోషిస్తాయన్న ఆశ ఉంది.

# సీబీఐసీ ద్వారా జులై 4, 2024 నుంచి అమల్లోకి రానున్న ఎక్స్ఛేంజ్ రేట్ ఆఫ్ ఆటోమేషన్ మాడ్యూల్ (ఇఖేంఒ)

న్యూఢిల్లీ, జూన్ 29 :కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (అఃఎఐ) ఎక్ఛేంజ్ రేట్ ఆటోమేషన్ మాడ్యూల్ (ఇఖేంఒ) ప్రారంభానికి సంబంధించిన ప్రకటనను విడుదల చేసింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న మాన్యువల్ ప్రక్రియ స్థానంలో మారకపు రేటును నిర్ధారించి, ప్రచురించే ఆటోమేటెడ్ వ్యవస్థ జూలై 4, 2024 నుండి అమలులోకి వస్తుంది.

దిగుమతి, ఎగుమతిదారుల సౌలభ్యం కోసం 22 దేశాలకు చెందిన కరెన్సీ మారకపు విలువను ఆన్‌లైన్లో ముందుగానే ఈఆర్ఏఎం ప్రచురించే పద్ధతి వాణిజ్య ప్రక్రియను సులభతరం చేయడంలో కీలకమైన ఘట్టం. ఈ మారకపు రేట్లు ఐస్‌గేట్(ఎఆఇఉఇఇ) వెబ్సైట్లో నెలకు రెండు సార్లు అంటే నెలలో మొదటి, మూడో గురువారాల సాయంత్రం అందుబాటులోకి వచ్చి, మరుసటి రోజు అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయి. 25 జూన్ 2024 నాటి ప్రకటన 07/2024-కస్టమ్స్ లో కూలంకషంగా వివరణ ఉంది.

ఈ ఆటోమేటెడ్ వ్యవస్థ నోటిఫికేషన్ ద్వారా మారకపు విలువను తెలియజేసే పద్ధతికి స్వస్తి చెబుతుంది. సీబీఐసీ వెబ్సైట్లో పొందుపరిచిన లింక్ ఐస్‌గేట్ వెబ్సైట్ కు వినియోగదారున్ని తీసుకెళుతుంది. అక్కడ ప్రచురితమైన మారకపు విలువలను చూడవచ్చు. ప్రచురితమైన మారకపు విలువలు సిస్టమ్లో స్టోర్ అవుతాయి, భవిష్యత్తు అవసరాల కోసం ఐస్‌గేట్‌లో అందుబాటులో ఉంటాయి. తద్వారా వినియోగదారునికి నిన్నటి ధరలు సరి చూసుకోవడానికి వీలు కలుగుతుంది.

సుంకాల విధానంలో డిజిటలైజేషన్లో సీబీఐసీ స్థిరంగా పురోగతి సాధిస్తోంది. ఈఆర్ఏఎం ప్రారంభించడం ఈ దిశగా వేసిన మరో ముందడుగు.

# జాతీయ రాజమార్గ ప్రాజెక్టుల యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను సమీక్షించడం కోసం ఒక ప్రత్యేకసెల్ ను ఏర్పాటు చేసిన ఎన్ హెచ్ఎఐ

న్యూఢిల్లీ, జూన్ 29 :జాతీయ రాజమార్గాల నిర్మాణం లో అత్యున్నతమైనటువంటి ప్రమాణాల సాధన కు, ప్రభావవంతమైన విధం గా ఖర్చు పెట్టడానికి మరియు ప్రాజెక్టుల ను అనుకున్న కాలానికల్లా పూర్తి చేయడానికి పూచీ పడడం కోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఎఐ) ఒక వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక విభాగాన్ని (డిపిఆర్ సెల్) ను న్యూ ఢిల్లీ లోని ఎన్ హెచ్ఎఐ ప్రధాన కేంద్రం లో ఏర్పాటు చేసింది. ఈ సెల్ నిపుణుల సూచనల ను అందించడం తో పాటు జాతీయ రాజమార్గాల ప్రాజెక్టుల విషయం లో డిపిఆర్ ను చివరికంటా పర్యవేక్షించేందుకు వీలు ను కల్పిస్తుంది. డిపిఆర్ సంబంధి సమీక్ష ప్రక్రియ లో ఏకరూపత ను తీసుకు రావడం లో ఈ విభాగం సహాయకారి గా ఉండడం తో పాటు ప్రాజెక్టులు కార్యరూపాన్ని దాల్చే లోపే మంచి నాణ్యమైన డిపిఆర్ లు రూపొందేటట్లు గాను మరియు వాటి ని సమీక్షించేటట్లు గాను పూచీ పడుతుంది.

జాతీయ రాజమార్గ ప్రాజెక్టు విజయవంతం గా అమలు అవ్వాలి అంటే డిపిఆర్ రూపకల్పన అనేది అత్యవసరమైనటువంటి అంశం. దీనిలో ప్రాజెక్టు కు సంబంధించినటువంటి వేరు వేరు సర్వేక్షణ లు, పరిశోధన లు మరియు డిజైన్ లు ఉంటాయి. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్ సి) ప్రత్యేక లక్షణాల కు మరియు ప్రమాణాల కు అనుగుణం గా, హైవే కంపోనంట్స్ (హైవే ఎండ్ స్ట్రక్చర్స్) అన్నిటి కోసం విభిన్న కొలమానాలకు తుది రూపు ను ఇవ్వడం లో డిపిఆర్ సెల్ సహాయకారి గా ఉంటుంది.

డిపిఆర్ సెల్ లో సుమారు 40 మంది వృత్తి నిపుణుల తో కూడిన ఒక ప్రత్యేకమైన బృందం ఉంటుంది; ఈ బృందం లో ప్రధాన డిపిఆర్ నిపుణులు, రహదారి భద్రత, రాకపోకలు, భూమి సేకరణ, వంతెనలు, సొరంగాలు, భూ సాంకేతిక విజ్ఞా?న నిపుణులు, సీనియర్ హైవే నిపుణులు, అటవీ ప్రాంత స్పెశలిస్టులు సహా వేరు వేరు రంగాల కు చెందిన నిపుణులు ఉంటారు.

ఈ నిపుణులు డిపిఆర్ ప్రాజెక్టు జీవన కాలం పర్యంతం సమీక్ష ప్రక్రియ ఏక రీతి న కొనసాగేటట్లుగా చూసేందుకు తగిన పర్యవేక్షక వ్యవస్థల ను మరియు యంత్రాంగాల ను అభివృద్ధి పరచడం లో తోడ్పడుతారు. దీనికి అదనం గా, ఈ జట్టు జాతీయ రాజమార్గ ప్రాజెక్టుల కు సంబంధించిన బిడ్ దస్తావేజుల ను మరియు టెక్నికల్ షెడ్యూల్స్ ను కూడను అధ్యయనం చేయడం, డిజైన్ వారీ గా వ్యయం అంచనాల ను కూడా అందిస్తుంది. నిర్మాణాన్ని చేపట్టే కంటే ముందు అమలు పరచవలసినటువంటి కార్యకలాపాల తాలూకు పథక రచన ను చేయడం లోను మరియు ప్రాజెక్టు ను హైవే ఇన్‌ఫర్మేషన్ మోడల్ సాఫ్ట్ వేర్ (హెచ్ఐఎమ్ఎస్)తో జతపరచడం లోను సాయపడుతుంది. ఈ విభాగం యొక్క అధికారులు డిపిఆర్/డిజైన్ కన్సల్టెంట్ల ద్వారా అందే ప్రతిపాదనల మూల్యాంకనం చేయడం కోసం ఆ యా స్థలాల ను సందర్శిస్తారు. ప్రాజెక్టు కు సంబంధించినటువంటి డిపిఆర్ లో నాణ్యత ను వృద్ధి చెందింప చేయడానికి వినూత్నమైన అభ్యాసాల ను గురించి కూడా వీరు సూచనల ను చేస్తారు.

కచ్చితమైన నివేదికల ను తయారు చేయడం లో డిపిఆర్ సెల్ సాయపడడం ద్వారా ప్రపంచ శ్రేణి జాతీయ రాజమార్గాల అభివృద్ధి కి దోహదం చేస్తుంది; మరి ఈ విధం గా ఇది దేశం యొక్క వృద్ధి కి తన వంతు తోడ్పాటు ను అందిస్తుంది.

# మెరుగు పరచిన బూస్టర్ కాన్ఫిగరేషన్‌తో అభివృద్ధిపూర్వకమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన హై స్పీడ్ ఎక్స్‌పెండబుల్ ఏరియల్ టార్గెట్ 'అభ్యాస్'

న్యూఢిల్లీ, జూన్ 29 :రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్ డిఒ) మెరుగులు దిద్దిన బూస్టర్ కాన్ఫిగరేషన్ అండ తో హై స్పీడ్ ఎక్స్‌పెండబుల్ ఏరియల్ టార్గెట్ (హెచ్ఇఎటి) 'అభ్యాస్' యొక్క అభివృద్ధిపూర్వకమైన పరీక్ష ను వరుస గా ఆరో సారి విజయవంతం గా పూర్తి చేసింది. దీనిని ఒడిశా లోని చండీపుర్ లో గల ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) నుండి నిర్వహించడమైంది. దీనితో 'అభ్యాస్' ఈ వ్యవస్థ యొక్క విశ్వసనీయత ను చాటి చెప్తూ, వది ఈ తరహా పరీక్షల ను విజయవంతం గా ముగించుకొంది.

ఈ పరీక్షల ను మెరుగులు దిద్దిన రేడార్ క్రాస్ సెక్షన్, విజువల్ ఎండ్ ఇన్ ఫ్రారెడ్ ఆగ్‌మెంటేషన్ సిస్టమ్స్ దన్ను తో జరిపారు. ఈ పరీక్షల క్రమం లో, బూస్టర్ ను భద్రం గా విడుదల చేయడం, లాంచర్ క్లియరెన్స్ మరియు మన్నికైన ప్రదర్శన వంటి ఈ మిశన్ యొక్క లక్ష్యాలు జయప్రదం గా నెరవేరాయి. కనీస లాజిస్టిక్స్ తో తేలికైన ఆచరణ ను చూపుతూ 30 నిమిషాల అంతరం లో రెండు ప్రయోగాల ను నిర్వహించడమైంది. ఈ గగనతల విహార పరీక్షల ను విభిన్న సేన ల ప్రతినిధులు చూశారు.

బెంగళూరు లోని డిఆర్ డిఒ యొక్క ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిశ్‌మెంట్ 'అభ్యాస్' కు రూపురేఖల ను ఇవ్వగా, దీనిని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇంకా లార్సెన్ ఉ టుబ్రో లు అభివృద్ధి పరచాయి. ఇది ఆయుధ వ్యవస్థల కు ఒక వాస్తవికమైనటువంటి ముప్పు ను ఎదుర్కొనే సత్తా ను సమకూర్చుతున్నది. దేశీయం గా రూపొందించిన ఈ వ్యవస్థ స్వయంచాలక శక్తి ని కలిగి ఉంది. దీనిలో ఆటో పైలట్, లాప్ టాప్ ఆధారితమైన భూ నియంత్రణ వ్యవస్థ, నింగి కి ఎగసే కంటే ముందే తనిఖీల నిర్వహణల తో పాటు స్వయం ప్రేరిత వాయు గమనం వంటి హంగుల ను జత పరచడమైంది. నింగి లో ప్రయాణించే కాలం లో డేటా ను రికార్డు చేసే ప్రత్యేక ఏర్పాటు కూడా దీనిలో ఉంది. ఈ ఏర్పాటు 'అభ్యాస్' నేల మీదకు తిరిగి వచ్చాక చేపట్టే విశ్లేషణ కు పనికి వస్తుంది. బూస్టర్ ను అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ లేబొరేటరీ తీర్చిదిద్దగా, మార్గనిర్దేశక వ్యవస్థ ను రిసర్చ్ సెంటర్ ఇమారత్ సమకూర్చింది. ఏయే భాగాల ను ఏయే ఏజెన్సీ లు ఉత్పత్తి చేయాలనేది నిర్ధారణ కావడం తో, 'అభ్యాస్' ఇక తుది ఉత్పత్తి కోసం తయారు గా ఉంది.'అభ్యాస్ యొక్క అభివృద్ధిపూర్వకమైన పరీక్షల కు గాను డిఆర్ డిఒ కు, సాయుధ దళాల కు మరియు పరిశ్రమ రంగానికి రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింహ్ అభినందనల ను తెలిపారు. పరీక్షలు విజయవంతం కావడం శాస్త్రవేత్తల కు మరియు పరిశ్రమ కు మధ్య మేలైన కలయిక నెలకొందనడానికి ప్రముఖమైన నిదర్శన గా ఉంది అని ఆయన అన్నారు.

రక్షణ, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం యొక్క కార్యదర్శి మరియు డిఆర్ డిఒ యొక్క ఛైర్ మన్ డాక్టర్ శ్రీ సమీర్ వి. కామత్ ప్రయోగాత్మక గగనతల విహార పరీక్ష సఫలం కావడం లో పాలుపంచుకొన్న బృందాల కు అభినందనల ను తెలియజేశారు. ఈ వ్యవస్థ ఖర్చు పరం గా చూస్తే లాభకారి అనీ, అంతేకాకుండా దీనిని పెద్ద ఎత్తున ఎగుమతి చేసేందుకు అవకాశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు.

# డిఎస్ మరణం బాధాకరం- పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 29 :మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మరణం బాధాకరమని అన్నారు ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న ఆయన ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, ఉన్నత విద్య శాఖల మంత్రిగా సేవలందించారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బలంగా తన వాదం వినిపించిన నేతలలో ఆయనొకరని గుర్తు చేశారు? వారిని రెండు మూడు సందర్భాల్లో కలిశానని, ఈ సందర్భంగానే తన రాజకీయ ప్రయాణం, అభివృద్ధి గురించి అడిగి తెలుసుకుని జనసేన పార్టీ ఎదుగుదలను ఆకాంక్షించారన్నారు.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని సంతాప ప్రకటనలో పవన్ పేర్కొన్నారు. . శ్రీనివాస్ గారి కుమారుడు, లోక్ సభ సభ్యుడు ధర్మపురి తో పాటు వారి ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు..

# కొండగట్టు అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించిన పవన్ కళ్యాణ్



అమరావతి, జూన్ 29 :ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ ఇలవేల్పు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని శనివారం నాడు దర్శించుకున్నారు. అంజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. గత ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వారాహి విజయ యాత్రకు ముందు వారాహి వాహనానికి కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో తెలంగాణ, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఆలయానికి చేరుకున్నఆయనకు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ప్రధాన స్థానాచార్యులు కపీంద్ర స్వామి పవన్ కళ్యాణ్ కి సంప్రదాయబద్ధంగా తలపాగ చుట్టి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇరు వైపులా ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ అమ్మవార్లకు అర్చనలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి, స్వామి వారి ప్రసాదం అందచేశారు.

తెలంగాణలో పవన్ కళ్యాణ్ కి ఘన స్వాగతం

అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయానంతరం ఉప ముఖ్యమంత్రి హోదాలో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దర్శనానికి బయలుదేరిన పవన్ కి తెలంగాణలో జనసేన శ్రేణులు అడుగడుగునా ఘన స్వాగతం పలికాయి. హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చి సాగనంపారు.

తుర్కపల్లి, శామీర్ పేట, సిద్ధిపేట, కరీంనగర్, గంగాధర తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ శ్రేణులు గజమాలలతో స్వాగతించారు. పవన్ కళ్యాణ్ గారి విజయానికి చిహ్నంగా తల్వార్ బహూకరించి జేజేలు పలికారు. పవన్ కళ్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతం అంతా పార్టీ శ్రేణులు అభిమానులతో కిటకిటలాడింది. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ శ్రీ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు.

ఈ పర్యటనలో పార్టీ ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, తెలంగాణ ఇంఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు సాగర్, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, రాధారం రాజలింగం, వై.నగేష్, సంపత్ నాయక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# మనీ లాండరింగ్, ఉగ్రవాద ఫైనాన్సింగ్‌పై పోరాటంలో భారతదేశం చేసిన ప్రయత్నాలను ప్రశంసించిన ఎఫ్ఏటిఎఫ్

న్యూఢిల్లీ, జూన్ 29 :ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటిఎఫ్) 2023-24 సంవత్సరానికి నిర్వహించిన మ్యూచువల్ ఎవాల్యుయేషన్ లో భారత్ అద్భుత ఫలితాలు సాధించింది. జూన్ 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సింగపూర్ లో నిర్వహించిన ప్లీనరీలో ఎఫ్ఏటిఎఫ్ ఆమోదించిన భారతదేశానికి సంబంధించిన మ్యూచువల్ ఎవాల్యుయేషన్ నివేదికలో భారత్ నున "రెగ్యులర్ ఫాలో అప్" వర్గీకరణలో పెట్టింది. జి-20 దేశాలు మాత్రమే సాధించిన ఘనత ఇది. మనీ లాండరింగ్ (ఎంఎల్), ఉగ్రవాద ఫైనాన్సింగ్ (టిఎఫ్) వ్యతిరేక పోరాటంలో భారతదేశం చేసిన ప్రయత్నాలకు ఇది విశిష్టమైన మైలురాయి.

ఎఫ్ఏటిఎఫ్ మ్యూచువల్ ఎవాల్యుయేషన్ లో భారతదేశం సాధించిన విజయం వృద్ధిపథంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతో ప్రయోజనకరం. ఫైనాన్షియల్ వ్యవస్థ స్థూల స్థిరత్వం, సమగ్రతకు ఇది దర్పణం. మంచి రేటింగ్ లభించడం వల్ల ప్రపంచ మార్కెట్లకు అనుసంధానత ఏర్పడుతుంది. ఇన్వెస్టర్ విశ్వానం పెరుగుతుంది. భారతదేశానికి చెందిన సత్వర చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ పట్ల ప్రపంచవ్యాప్త విస్తరణకు వీలు కలుగుతుంది.

ఎంఎల్/టిఎఫ్ ముప్పు నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు గత 10 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం తీవ్రస్థాయిలో సమర్థవంతంగా తీసుకున్న నివారణ చర్యలకు ఈ ఎఫ్ఏటిఎఫ్ గుర్తింపు గీటురాయి. ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటానికి అనుకూలంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలకు, అంతర్జాతీయ ప్రమాణాలు అనుసరించేందుకు ప్రకటించిన కట్టుబాటుకు ఇది నిదర్శనం. ఉగ్రవాద ఫైనాన్సింగ్ కు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రమాణాలు సమర్థవంతంగా అమలు పరిచేలా ఇతర దేశాలకు కూడా ఇది ఉత్తేజితంగా నిలుస్తుంది. అలాగే భారతదేశం సాధించిన ఈ విజయం ఉగ్రవాద ఫైనాన్సింగ్, మనీ లాండరింగ్ కు వ్యతిరేకంగా ప్రపంచం చేస్తున్న ప్రయత్నాలకు నాయకత్వం వహించగల భారతదేశ సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది.

ఎంఎల్, టిఎఫ్, నల్లధనం వంటివి నిర్మూలించేందుకు 2014 సంవత్సరం నుంచి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరించిన ఈ బహుముఖీన వ్యూహం సమర్థవంతమైనదిగా, సానుకూల ఫలితాలు సాధించేదిగా నిరూపితమయింది. కార్యాచరణపూర్వకమైన గూఢచర్య ప్రయత్నాల ద్వారా ఉగ్రవాద ఫండింగ్ ను ధ్వంసం చేయడంలో భారత అధికారుల విజయానికి ఇది నిదర్శనం. భారత కోస్తాలో ఉగ్రవాద ఫైనాన్సింగ్, నల్లధనం, మాదక ద్రవ్యాల ప్రవాహాన్ని ఈ చర్యలు నిలువరించాయి.

ఇదిలా ఉండగా గత రెండు సంవత్సరాలుగా ఎఫ్ఏటిఎఫ్ లో మ్యూచువల్ ఎవాల్యుయేషన్ ప్రాసెస్ విషయంలో రెవిన్యూ శాఖ (డిఓఆర్) తీవ్ర కృషి చేసింది. విభిన్న మంత్రిత్వ శాఖలు, జాతీయ భద్రతా మండలి సచివాలయం (ఎన్ఎస్ సిఎస్), రాష్ట్ర అధికారులు, న్యాయ వ్యవస్థ, ఆర్థిక రెగ్యులేటర్లు, స్వయం నియంత్రిత సంస్థలు, ఆర్థిక సంస్థలు, వ్యాపార సంస్థలు అన్నీ కీలక పాత్ర పోషించాయి. ఎఎంఎల్/సిఎఫ్ టి వ్యవస్థల సమన్వయపూర్వక చర్యలను ఇది ప్రతిబింబిస్తుంది.

భారతదేశం ఇప్పటికే ఎఫ్ఏటిఎఫ్ స్టీరింగ్ గ్రూప్ సభ్య దేశంగా ఉంది. గ్రూప్ స్థూల పనితీరు మెరుగుపరచడంలో భారతదేశానికి వర్తమాన పనితీరు ఎంతో దోహదపడుతుంది.

ఎఎంఎల్/సిఎఫ్ టి వ్యవస్థను మరింత పటిష్టపరచడానికి, ఆర్థిక నేరాలపై పోరాటం విషయంలో అంతర్జాతీయ భాగస్వాములతో సహకారానికి భారతదేశం కట్టుబడి ఉంది. మరింత సురక్షితమైన, పారదర్శకమైన ఆర్థిక వాతావరణం కల్పించడంలో ఈ విజయాన్ని పునాదిగా తీసుకుంటుంది.

# రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ..




వరంగల్, జూన్ 29 :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం ములుగు జిల్లా వాజేడు సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సమావేశానికి సహకార సంఘం అధ్యక్షులు ఎగ్గడి అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్ మాట్లాడుతూ? రైతు భరోసా పథకంపై రైతులు తమ తమ అభిప్రాయాలను నేరుగా వ్యక్త పరచాలని కోరారు.

ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను స్వయంగా తెలిపారు. రైతులు వ్యవసాయం చేసే ప్రతి ఎకరానికి రైతు భరోసా కల్పించాలని కోరారు. రైతు అభిప్రాయాలను స్వీకరించిన అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏవో వేణుగోపాల్, సహకార సంఘం ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాధరాజు, సహకార సంఘం సీఈఓ సత్యనారాయణ, సహకార సంఘం సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.

# వాకింగ్, యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.. ఎస్పీ చెన్నూరి రూపేష్



సంగారెడ్డి, జూన్ 29 : జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఆర్మూడ్ రిజర్వ్ డియస్పి నరేందర్ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి, రామ రావ్, హన్మి రెడ్డి ఆర్.ఐ.లు పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు ఆర్మూడ్ రిజర్వ్ పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి, హోంగార్డ్ సిబ్బందితో వీక్లీ పరేడ్ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ? వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, రోజువారీ విధులలో భాగంగా మెళకువలు నేర్చుకోవడం, డ్రిల్స్ ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు.

ప్రతి రోజూ వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమని సిబ్బంది, అధికారులు ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే తమ విధులు సక్రమంగా నిర్వహించగలమని, ప్రతి ఒక్కరికీ ఫిజికల్ ఫిట్నెస్ తప్పనిసరి అన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ పరేడ్ నందు అధికారులకు విన్నవించుకోవడానికి వీలుంటుందని, పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, జిల్లాకు, తెలంగాణ పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

# 10 రూపాయల కోసం ఆటో డ్రైవర్ దారుణ హత్య

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ లో దారుణం వెలుగులోకి వచ్చింది. 10 రూపాయల కోసం ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. రూ. 10 చెల్లించే విషయంలో ఓ ప్రయాణికుడు తీవ్ర వాగ్వాదం తర్వాత ఆటో డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టాడు. దీంతో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ గురువారం ఆసుపత్రిలో మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న గుర్తు తెలియని ప్రయాణికుడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.వట్టెపల్లి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అన్వర్ (39) జూన్ 12న చార్మినార్ వద్ద ఓ ప్రయాణికుడిని తన ఆటోలో ఎక్కించుకుని షంషీర్‌గంజ్‌లో దింపాడు. షంషీర్‌గంజ్ చేరుకున్న తర్వాత, ప్రయాణీకుడు రూ.10 చెల్లించాడు, అయితే అన్వర్ మరో రూ.10 చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ప్రయాణికుడు అన్వర్‌ను దూషించడమే కాకుండా కనికరం లేకుండా తీవ్రంగా కొట్టాడు. ఇది గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో ప్రయాణికుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు అన్వర్‌ను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అన్వర్ జూన్ 27న మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# డీఎస్‌కు నివాళులర్పించిన ఎంపీ వద్దిరాజు..



హైదరాబాద్, జూన్ 29 :రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ కు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఎంపీ రవిచంద్ర బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని డీఎస్ నివాసానికి శనివారం మధ్యాహ్నం తన సన్నిహితులు సర్ధార్ పుటం పురుషోత్తమ రావు, ఏనుగు రాజేందర్, ఆది విష్ణుమూర్తి, ఆకుల రజిత్, మరికల్ పోత సుధీర్ కుమార్, మాలి కరుణాకర్, ఊసా రఘులతో కలిసి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులతో కలిసి డీఎస్ చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు, కుమారులు సంజయ్, అరవింద్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివంగత నాయకుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# బోనాల పండుగకు టీజీఎస్పీడీసీఎల్ సన్నద్ధం..




హైదరాబాద్, జూన్ 29 :హైదరాబాద్ జంట నగరాల్లో జరగనున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కోసం సన్నద్ధమైందని సీఎండీ ముషరఫ్ ఫారూఖీ అన్నారు.

విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలోఆయన మాట్లాడారు? బోనాల పండుగకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పండుగ ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయాల వద్ద విద్యుత్ సరఫరా కోసం ప్రతీ ఆలయానికి ఓ నోడల్ అధికారి, ఏఈని కేటాయించాలని ఆదేశించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అదనపు తాత్కాలిక లైట్లు, ఎయిర్ కండిషనింగ్, సౌండ్ సిస్టమ్‌లతో సహా నెట్‌వర్క్ సజావుగా ఉండేలా అధికారులు ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు పండుగ ప్రారంభం నుండి పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బందికి 24 గంటల పాటు విధులను కేటాయించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యామ్నాయ సామాగ్రిని అవసరమైన చోట ఏర్పాటు చేయాలని సూచించారు.

అన్ని విద్యుత్ స్తంభాలు ముఖ్యంగా ప్రధాన రహదారులు, లేన్‌లు, బైలేన్‌లలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడే అవకాశం ఉన్న చోట స్తంభాలు షాక్‌లకు గురికాకుండా తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు కె.సాయిబాబా, ఎల్.పాండ్య, వి.శివాజీ, పి.బిక్షపతి, పి.ఆనంద్, సీజీఎం శ్రీకృష్ణారెడ్డి, సూపరిం-టె-ండింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో "నీట్" వద్దు ... మోదీతో సహ 8 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ

చెన్నై, జూన్ 29 : వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష (నీట్) విధానాన్ని ఎత్తేయాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీతో పాటు ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖలు రాశారు. అలాగే నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని పునరుద్ఘాటించారు. వృత్తిపరమైన కోర్సుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా కాకుండా 12 వ తరగతి మార్కుల ద్వారా మాత్రమే ఉండాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ అనేది విద్యార్థులపై అనవసరమైన అదనపు ఒత్తిడి అని ఆరోపించారు. అలాగే, నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని, 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్ల కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించినట్లు సీఎం స్టాలిన్ తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం కోసం ఈ బిల్లును పంపామని, ఇది పెండింగ్‌లో ఉందన్నారు.

మరోవైపు నీట్ రద్దు కోసం అసెంబ్లీలలో ఇదే విధమైన తీర్మానాన్ని ఆమోదించడాన్ని పరిశీలించాలని ఎనిమిది రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ సూచించారు. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పంజాబ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ సీఎంలకు ఈ మేరకు లేఖలు పంపారు. అలాగే నీట్ మినహాయింపు కోసం తమిళనాడు చేస్తున్న డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కూడా స్టాలిన్ లేఖ రాశారు.

# యువతకు సరైనా ప్రాధాన్యత ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

భారత దేశ విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

హైదరాబాద్ ప్రశాంత వాతావరణాన్ని చెడ గొడుతున్నా ఓవైసీ

డీఎస్ మృతి పట్ల ఆమె తీవ్ర సంతాపం

పిసిసి అధికార ప్రతినిధి పుష్పలీల




హైదరాబాద్ జూన్ (ఎక్స్ ప్రెస్ న్యూస్ )యువతకు సరైనా ప్రాధాన్యత ఇవ్వడం లో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజి మంత్రి పిసిసి అధికార ప్రతినిధి పుష్పలీల విమర్శించారు.

శనివారం గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సక్రమంగా పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం ఫెయిల్ అవడవే కాకుండా విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెగాటం ఆడుతుందని దుయ్యబట్టారు.వైద్య విద్యార్థులకు న్యాయం జరగాలంటే నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేసారు.భారత దేశ విద్యా విధానాన్ని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు.అయోధ్య లో బిజెపి ని ఓడించి మోదీకి రాముడు బుద్ధి చెప్పాడన్నారు.మోడీ ప్రభుత్వం వచ్చాక అన్ని యూనివర్సిటీల గ్రాంట్స్ తగ్గించిందన్నారు. మిషన్ భగీరథలో పథకంలో పారదర్శకత లేదు అన్ని లోపలే ఉన్నాయన్నారు. హైదరాబాద్ ప్రశాంత వాతావరణాన్ని ఓవైసీ చెడ గొడుతున్నారని ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది అమిత్ షా మోడి ఇద్దరు తోడు దొంగలని,మోడీ తెచ్చిన విదేశీ పెట్టుబడులు దేశ ప్రజలకు ఎంత ఖర్చు చేశారో చెప్పాలని పుష్ప లీల డిమాండ్ చేసారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీఎస్ మృతి పట్ల ఆమె తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

# రాజీనామా చేసినా వీసీని వదిలిపెట్టం - ఎంపి సిఎం రమేష్..

విశాఖపట్నం , జూన్ 29 :ఆంధ్రా యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు. వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేసినా ఏయూలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ అక్రమాలపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రాజీనామా చేసినప్పటికీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్ రాజీనామాల నేపథ్యంలో పూర్వ విద్యార్థులు వర్సిటీకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.

ఈ క్రమంలోనే ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్



తదితరులు వర్సిటీకి చేరుకుని పరిశీలించారు. వర్సిటీకి వచ్చిన నేతలకు ఏయూ విద్యార్థులు, పరిశోధకులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఆంధ్రా యూనివర్సిటీ నుంచే వైసీపీ కార్యకలాపాలు నడిచాయని ఆరోపించారు. ఏయూ వైసీపీ కార్యాలయంగా మారిందని విమర్శించారు. ఇక్కడ జరిగిన అవకతవకలపై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరుపుతామని తెలిపారు. వర్సిటీలోని వైఎస్ విగ్రహం తొలగించడం తమకు పెద్ద పనేమీ కాదని పేర్కొన్నారు. అయితే ఉద్యోగ, విద్యార్థి సంఘాల అభిప్రాయం మేరకే దానిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏయూ ప్రతిష్ఠను మాజీ వీసీ ప్రసాదరెడ్డి దెబ్బతీశారని మండిపడ్డారు.మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఆంధ్రా యూనివర్సిటీలో అనేక అక్రమాలు జరిగాయని విమర్శించారు. వర్సిటీలో వైఎస్ విగ్రహం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు పెట్టారని, నియామకాలు చేశారని ఆరోపించారు. అడ్డగోలుగా పదవులు పొందిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. ఏయూలో మళ్లీ పూర్వ పరిస్థితులు రప్పిస్తామన్నారు. యూనివర్సిటీలో రాజకీయాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా రాజకీయాలు చేస్తామన్నా చంద్రబాబు ఊరుకోరని అన్నారు.

# మొహర్రంకు ఎలాంటి అసౌకర్యాలు ఉండవు : మంత్రి పొన్నం

హైదరాబాద్, జూన్ 29 : మొహర్రం పవిత్ర మాసంలో నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆషుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆషుర్ ఖానాల పరిసర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

మొహర్రం పదో తేదీన ఏనుగుపై కొనసాగే బీబీ ఫాతిమా ఆలం ప్రధాన ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగు నీరు అందించాలని, జీ.హెచ్.యం.సీ అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. మొబైల్ టాయిలెట్లు తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.

ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీకా ఆలం పరిసరాల్లో పటిష్టవంతమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సంతాపం తెలిపేందుకు ఆషుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బంధులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వారి కోసం మినీ బస్సులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా అందుబాటులోకి ఉంచాలన్నారు.

# డీఎస్‌కి నివాళులర్పించిన ఎంపీ వద్దిరాజు



ఖమ్మం, జూన్ 29 :(నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ రవిచంద్ర బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని డీఎస్ నివాసానికి శనివారం మధ్యాహ్నం తన సన్నిహితులు సర్ధార్ పుటం పురుషోత్తమ రావు, ఏనుగు రాజేందర్, ఆది విష్ణుమూర్తి, ఆకుల రజిత్, మరికల్ పోత సుధీర్ కుమార్, మాలి కరుణాకర్, ఊసా రఘులతో కలిసి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులతో కలిసి డీఎస్ చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు, కుమారులు సంజయ్, అరవింద్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు, దివంగత నాయకుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# ఆధార్ అనుసంధానంతో దళారీలకు చెక్ పెట్టగలమా- టీటీడీ ఈవో జె.శ్యామలరావు



తిరుపతి,జూన్ 29 : శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్ లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్ ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు ఎంతవరకు వీలవుతుందనే అంశంపై దృష్టి సారించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఐటీ విభాగ నిపుణులతో అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల సమావేశ మందిరంలో ఈరోజు యుఐడిఎఐ (ఆధార్ సంస్థ) నుండి విచ్చేసిన అధికారులు, టిసిఎస్ జియో, టీటీడీ ఐటి విభాగంతో ఈవో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ? ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్ లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. అయితే ఈ అప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడం లేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐటి అధికారులను ఈవో ఆదేశించారు. ఇందుకు సంబంధించి యుఐడిఎఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు.

అంతకుముందు యుఐడిఎఐ అధికారులు ఆధార్ ను ఏ విధంగా అప్లికేషన్ లకు లింక్ చేయవచ్చు, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు, శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకృష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్ యాదవ్, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్‌ఓ నరసింహ కిషోర్, రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాకినాడలో రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ : మంత్రి నాదెండ్ల

అమరావతి, జూన్ 29 :కాకినాడలో రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ కోరతామని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో రెండో రోజు నిర్వహించిన సమీక్షను నిర్వహించారు. రేషన్ మాఫియా కు కాకినాడ అడ్డాగా మారిందని ఆరోపించారు.

అశోక ఇంటర్నేషనల్ హెచ్ 1 గోదాంను తనిఖీ చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యత లేని 5,300 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. గోదాంలోని నిల్వలపై స్టాక్ రిజిస్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాకినాడ పోర్టును వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం ఆక్రమించి అక్రమంగా బియ్యం ఎగుమతి చేస్తుందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమాల తనిఖీ కోసం బృందాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తనిఖీలు పూర్తయ్యేవరకు బియ్యం ఎగుమతులు ఆపేస్తామని వివరించారు.

# పింఛన్ ల కోసం రూ.4,400 కోట్లు విడుదల..

అమరావతి, జూన్ 29 :జులై 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి సిద్ధం అవుతోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. గత మూడు నెలల ముందే నుంచే పెంచిన పెన్షన్‌తో పాటు జులై నెల పెన్షన్ కూడా కలిపి ఒకేసారి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది.. దీని కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై కలెక్టర్లతో ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్.. పెన్షన్ల పంపిణీ నిమిత్తం రూ. 4,400 కోట్ల విడుదల చేసినట్టు వెల్లడించారు..

జులై 1వ తేదీన 65.18 లక్షల మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి ఫించన్లు పంపిణీ చేపట్టాలని స్పష్టం చేశారు.. ఫించన్ల పంపిణీకి ఇతర ఫంక్షనరీల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.. జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు.. పెన్షన్ల పంపిణీపై గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

సోమవారం ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ జులై 1వ తేదీన 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన డబ్బులను ఇవాళ రాత్రిలోగా విత్ డ్రా చేసుకోవాలని సూచించారు సీఎస్.

# ధర్మపురి శ్రీనివాస్ మృతికి పరికపల్లి సంతాపం

ఖమ్మం, జూన్ 29 :(నేటినిజం ప్రతినిధి): మాజీ మంత్రి, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ మృతికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఎంపీగా ఉమ్మడి రాష్ట్రానికి, తెలంగాణకు ఆయన విశేష సేవలం దించారని, శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన వెంటనే తన ప్రగాఢ సానుభూతి తెలిపి, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించా రు. సామాన్య కార్యకర్త నుంచి ఉన్నత సాయి వరకు అంచలంచెలుగా రాజకీయంగా ఎదిగి, ఎన్నో ఉన్నత పదవులనునిర్వహించారనిపరికపల్లిఅన్నారు.

# చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ : కేటీఆర్



హైదరాబాద్, జూన్ 29 : చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోవారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు కేటీఆర్.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సాయిచంద్ మరణించి ఏడాది అవుతుందంటే ఎవరం నమ్మలేకపోతున్నాం. తన మాటతో, పాటతో అద్భుతమైన వాగ్ధాటితో తెలంగాణ ప్రజలను ఉర్రూతలూగించిన అద్భుత కళాకారుడు సాయిచంద్. మన అందరి ఆప్తుడు.. చిరకాలం మా గుండెల్లో నిలిచపోయే తమ్ముడు.

భవిష్యత్‌లో సాయి కుటుంబం కోసం ఎల్లవేళలా పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆనాటి నుంచి నేటి వరకు ఎలా అండగా ఉన్నామో భవిష్యత్‌లో కూడా ఉంటాం. సాయి జ్ఞాపకార్థం పాటల సీడీలు, సంకలనాలు, పుస్తకాలు తీసుకొచ్చిన సోదరులకు అభినందనలు. తమ్ముడి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని కోరుకుంటూ కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఆర్యవైశ్యుల ఐక్యత సంక్షేమమే ధ్యేయం

## - నగర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా గెలిపించండి... సేవ చేసుకుంటా...
## - విలేకరుల సమావేశంలో మాజీ కౌన్సిలర్ పెనుగొండ ఉపేందర్ రావు

ఖమ్మం, జూన్ 29 :(నేటినిజం ప్రతినిధి): పేద, ధనిక తేడా లేకుండా ఖమ్మం నగరంలో ఆర్యవైశ్యుల ఐక్యత సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, నేడు ఖమ్మం వాసవి గార్డెన్ లో జరిగే ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ కౌన్సిలర్, మాజీ నగర అధ్యక్షులు పెనుగొండ ఉపేందర్ రావు నగర ఆర్యవైశ్యులకు విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెనుగొండ ఉపేందర్ రావు మాట్లాడుతూ...ఖమ్మం నగరంలో ఎంతోమంది పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు ఉన్నారని అనేక సమస్యలతో జీవనం కొనసాగిస్తున్న వారిని ఐక్యం చేసి వారి సంక్షేమాభివృద్దే ధ్యేయంగా పాటుపడుతానని అన్నారు. 2015నుండి 17వరకు తాను



ఆర్యవైశ్య సంఘం నగర అధ్యక్షునిగా పనిచేసిన సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేశానని గుర్తు చేశారు. అందులో 12వేల మందికి 'కార్తీకమాస వన సమారాధన, 220మందికి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతము, గాంధీ జయంతికి అన్నదాన కార్యక్రమం, పేద ఆర్యవైశ్య పిల్లలకు స్కాలర్ షిప్ లు, బూట్లు, డ్రెస్సులు, టైలు, నోటు పుస్తకాలు, బ్యాడ్జీలు, ఫ్యాడ్ లు ఉచితంగా ఏర్పాటు చేశానని గుర్తు చేశారు.

ఆదివారం జరిగే నగర ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష ఎన్నికల్లో బ్యాలెట్ నెంబర్ 2 పై ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్యవైశ్యులను మరొక్కసారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేన్ మార్కెట్ కమిటీ సభ్యులు కందిబండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలపై టి.సాట్-ప్రత్యేక లైవ్

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో భర్తీ చేసే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరం జాబ్ క్యాలండర్ లో భాగంగా భర్తీ చేసే సుమారు 17,727 సిజిఎల్ పోస్టులకు సంబందించి తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేందుకు టి-సాట్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట వరకు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవం కలిగిన బోధనా సిబ్బంది లైవ్ లో పరీక్షకు సంబందించిన సలహాలు-సూచనలు అందిస్తారన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఆదివారం జరిగే ప్రత్యేక లైవ్ లో పాల్గొని తమ సందేహాలను తీర్చుకునేందుకు 040 23556037, 040 23540726 టోల్ ఫ్రీ 1800 425 4039 ఫోన్ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఎస్.ఎస్.సి సిజిఎల్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 24వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా అక్టోబర్ లో టైర్-1(ప్రిలిమ్స్), డిసెంబర్ లో టైర్-2 (మేయిన్స్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్.ఎస్.సి ప్రకటించిందన్నారు. జూన్ 30వ తేదీన లైవ్ అనంతరం జూలై ఒకటవ తేదీ ఉదయం 10 నుండి 11 గంటల వరకు గంట పాటు 122 రోజులు రికార్డెడ్ కంటెంట్ ప్రసారం చేస్తున్నట్లు సీఈవో తెలిపారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్నెన్ అండ్ జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులపై అవగాహన ప్రసారాలుంటాయని సీఈవో వేణుగోపాల్ రెడ్డి గుర్తు చేశారు.

# పీసీసీ అధ్యక్ష పదవిని బీసీకి కేటాయించండి ..

## -రాహుల్ గాంధీ కార్యాలయానికి లేఖ..
## -కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరిన బీసీ రాజ్యాధికార సమితి .

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో సామాజిక న్యాయం సాక్షాత్కారం అవ్వాలంటే పీసీసీ అధ్యక్షుడిగా బీసీకే అవకాశమివ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు..తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఓసీకి ముఖ్యమంత్రి పదవి, ఎస్సీకి ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి సామాజిక న్యాయ దిశగా పయనిస్తున్న నేపథ్యంలో బీసీలకు పీసీసీ అధ్యక్ష పదవి అనివార్యమవుతున్నదన్నారు..తెలంగాణలో రాజకీయంగా బీసీలు గత పదేళ్లుగా తీవ్రంగా అణగదొక్కబడుతున్నారన్నారు. అవకాశాలన్నీ నేటికీ ఒకే అగ్రవర్ణానికి పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు . తెలంగాణలో, దేశంలో భవిష్యత్తు రాజకీయాలు బీసీల చుట్టే తిరగనున్నాయనీ , బీసీల ఎదుగుదలను విస్మరిస్తే జాతీయ పార్టీలకు మనుగడ కష్టమేనని పేర్కొన్నారు .సామాజిక, హిస్సేధారీ న్యాయానికి బీసీల సాధికారతే మూలస్తంభం అనీ , బీసీల రాజకీయ పునరుజ్జీవనం కోసం కాంగ్రెస్ పార్టీ ఈ దిశగా ముందడుగు వెయ్యాలన్నారు ..ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు కేటాయించాల్సిన సీట్లు రాకున్నా తెలంగాణ రాష్ట్రంలో ఐఖీ పాలన నుండి విముక్తికై అధికార మార్పు కోసం బీసీలు కాంగ్రెస్ కు అండగా నిలిచామన్నారు . పార్లమెంటు సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగినా ఇంకా ఓపికతోనే మా వర్గాలకు అవకాశాలను ఇనుమడింపజేసుకోవడం కోసమే పీసీసీ అధ్యక్ష పదవిని అడుగుతున్నామనీ తమ ఆవేదనను కాంగ్రెస్ అధిష్ఠానం అర్థం చేసుకోవాలని కోరారు..30 ఏళ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు నిబద్దుడై అధిష్టానానికి, ముఖ్యమంత్రికి విధేయుడుగా ఉన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హుడనీ, తన అభ్యర్థిత్వాన్ని అధిష్టానం పరిగణన లోకి తీసుకొని తెలంగాణలో బీసీల నాయకత్వపు ఎదుగుదలకు ఊతమవ్వాలని దాసు సురేశ్ లేఖలో కోరారు..

# తెలంగాణ అవసరాల మేరకే ఛత్తీస్‌గఢ్‌తో అవగాహన ఒప్పందం..

## -జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు జగదీశ్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, జూన్ 29 : ప్రత్యేక రాష్ట్ర అనంతరం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఛత్తీసగఢ్‌తో అప్పటి ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని మాజీ విద్యుత్‌శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. 2003లో కేంద్ర ప్రభుత్వ విద్యుత్ చట్టం ప్రకారం.. పీజీసీఐఎల్ నిబంధనలకు లోబడి ఒప్పందాలు జరిగాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఇది దోహదపడిందని.. ఎలాంటి నష్టం జరుగలేదని స్పష్టం చేశారు. నాటి చట్టాలకు, నిబంధనలకు లోబడి భద్రాద్రి విద్యుత్ కేంద్రాన్ని సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించినట్లు పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలో నిర్మాణం పూర్తి చేస్తామని బీహెచ్‌ఈఎల్ ముందుకు రావడంతో కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్రాజెక్టు, మణుగూరులో నాలుగు 270 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం ఆ సంస్థకు అప్పగించినట్లు చెప్పారు.

రైతులకు 24 గంటల విద్యుత్, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నల్గొండ జిల్లా దామరచర్లలో 4వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఒక అంశంపై విచారణ జరిగినప్పుడు ఒప్పందాల్లో భాగస్వాములైన వారందరినీ విచారించాలన్నారు. కానీ, కొంతమందిని మాత్రమే విచారించి మీడియా సమావేశంలో మాట్లాడడం బాధాకరమన్నారు. ఇలా చేయడం ద్వారా, తమ రాజకీయ ప్రత్యర్థులు కక్షపూరితంగా చేసిన నిరాధార, అర్థరహిత ఆరోపణలకు ఊతమిచ్చినట్లే అవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వివిధ ప్రాజెక్టుల నిర్మాణం, ఛత్తీసగఢ్‌తో విద్యుత్ కొనుగోలు, పీజీసీఐఎల్ లైన్‌లో వాటా కొనుగోలు ఒప్పందాలు, నిబంధనల ప్రకారం జరిగాయా? ప్రభుత్వ ఖజానాకు ఏమైనా నష్టం జరిగిందా? అనే విషయాలపై విచారణ జరుపుతున్న కమిషన్‌కు అందిన సమాచారాన్ని, తనకు తెలిసిన విషయాలు, అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# బోనాల పండుగకు విద్యుత్ ఏర్పాట్లు

## -సర్కిల్ అధికారులతో విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సమీక్ష




హైదరాబాద్, జూన్ 29 :ఆషాఢ మాసం బోనాల పండుగ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నంద కుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు కె. సాయిబాబా, ఎల్. పాండ్య, వి. శివాజీ, పి. బిక్షపతి, పి. ఆనంద్, సీజీఎం కృష్ణారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం, ఉన్నతాధికారులకు సీఎండీ ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు.

# ఎస్బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి..!

హైదరాబాద్, జూన్ 29 :దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంక్ 'ఎస్బీఐ' తదుపరి చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి ఎంపికయ్యారు.

ప్రస్తుతం బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఈ మేరకు చల్లా శ్రీనివాసులు శెట్టి పేరును ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎన్ఐబీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

'పనితీరు, అనుభవంతోపాటు ఇతర పారామీటర్లను పరిగణనలోకి తీసుకుని ఎస్బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టిని ఎంపిక చేశాం' అని ఎఫ్ఎస్ఐబీ శనివారం జారీ చేసిన నోటిఫికేషన్ లో తెలిపింది. శనివారం ఎస్బీఐలోని ముగ్గురు మేనేజింగ్ డైరెక్టర్లను ఎఫ్ఎస్ఐబీ ఇంటర్వ్యూ చేసింది.

ఇంతకుముందు 2020 అక్టోబర్ ఏడో తేదీన ప్రస్తుత ఎస్బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖరా ఎంపికయ్యారు. అయితే గతేడాది అక్టోబర్‌లో ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది. ఆయన వయస్సు 63 ఏండ్లు వచ్చే వరకూ అంటే ఈ ఏడాది ఆగస్టు 28 వరకూ దినేష్ కుమార్ ఖరా పదవీ కాలాన్ని పొడిగించింది.

తాజాగా దినేష్ కుమార్ ఖరా స్థానంలో కొత్త ఎస్బీఐ చైర్మన్‌గా ఎంపికైన చల్లా శ్రీనివాసులు శెట్టి.. ప్రస్తుతం బ్యాంకు రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్ అధిపతిగా ఉన్నారు. ఏజీబీఎస్సీ పూర్తి చేసిన శ్రీనివాసులు శెట్టి.. సర్టిఫైడ్ అసోసియేట్ ఆఫ్ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్‌లో పట్టా పొందారు. 1988లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్బీఐలో కెరీర్ ప్రారంభించారు.

30 ఏండ్లకు పైగా ఎస్బీఐలో సేవలందించిన చల్లా శ్రీనివాసులు శెట్టి.. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, అభివృద్ధి చెందిన మార్కెట్లలో బ్యాంకింగ్ విభాగాల్లో అనుభవాన్ని గడించారు.

# ప్రైవేటీకరణ దిశగా విద్యుత్ రంగం.. అదానీకి అప్పగించనున్న ప్రభుత్వం



హైదరాబాద్, జూన్ 29 :రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ పంపిణీ బాధ్యతలను పైలట్ ప్రాజెక్టుగా అదానీ గ్రూప్‌కు అప్పగించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

పాత బస్తీలో కరెంట్ బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని, వసూలు చేసేందుకు వెళ్లే కరెంట్ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగుతున్నారని సీఎం ఢిల్లీలో విలేకరులతో అన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఆ తర్వాత హైదరాబాద్ నగరంలో, ఆపై రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ బాధ్యతను ఆదానికి అప్పగిస్తామని తెలిపారు. అదానీ గ్రూప్ ద్వారా వచ్చే ఆదాయంలో 75% రాష్ట్ర ప్రభుత్వానికి, మిగిలిన 25% అదానీ గ్రూప్‌కు వెళ్తుందని చెప్పారు. దీనిపై ఇప్పటికే అదానీ గ్రూప్‌తో చర్చించామని, వారు అంగీకరించారని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్టును సిద్ధం చేయాలని అదానీ గ్రూప్‌ను కోరినట్టు వెల్లడించారు.

# పీవీ ఆర్థిక సంస్కరణల వల్లే అభివృద్ధిపథంలో దేశం: మాజీ మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 29 : పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణ ఫలితంగానే దేశం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన ఒక చరిత్ర అని, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి.. ప్రధానిగా ఎదిగి దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీవీ ఆర్థిక సంస్కరణల వల్ల దేశం నేడు అభివృద్ధి పథంలో పయణిస్తున్నదని చెప్పారు.

పీవీ ఖ్యాతిని గుర్తించిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీవీకి దేశ అత్యున్నత పురస్కారం ఇచ్చిందని వెల్లడించారు. పీవీ చరిత్రను నేటి యువత చదువుకోవాలని సూచించారు. ప్రధానిగా నాడు ఆయన తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు ప్రభుత్వాల పాలన ముందుకు సాగుతున్నదని వెల్లడించారు.

దేశానికి పీవీ చేసిన సేవలు మరువలేనివి: కేటీఆర్

దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీవీ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీ, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ సేవలను గుర్తు చేసుకున్నారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. హస్తినలో ప్రధాని పీఠాన్ని అధిష్టించిన మొదటి దక్షిణ భారత నాయకులు పీవీ నరసింహారావు అని పేర్కొన్నారు. దేశానికి పీవీ చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ప్రమాదపు అంచున ఉన్న దేశానికి ఆర్థిక దిశానిర్దేశం చేసిన ప్రధాని మన పీవీ అని ప్రశంసించారు. దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ముందుకు నడిపిన వ్యక్తి మన పీవీ. బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావును దేశం ఎన్నటికీ మరిచిపోదు. భూసంస్కరణల్లో భాగంగా 8 వందల ఎకరాల భూమిని సర్కార్‌కు అప్పగించిన గొప్ప నాయకుడు పీవీ. విద్యాసంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నతుడు పీవీ. పీవీ నరసింహారావుకు భారతరత్న కోసం అసెంబ్లీలో తీర్మానం చేశాం. భారతదేశాన్ని ప్రపంచపటంలో ఉన్నతంగా నిలిపారు పీవీ. నెక్లెస్ రోడ్డుకు పీవీ పేరు నామకరణం చేశాం. అక్కడే ఆయన విగ్రహం ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై..గుల్బర్గాకు తీసుకెళ్లి లైంగిక దాడి..

హైదరాబాద్, జూన్ 29 :ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నారాయణగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్‌తో కలిసి సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బొగ్గులకుంటకు చెందిన బాలిక(14) హైదర్‌గూడలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నది.

ఆగాపురాకు చెందిన షేక్ అర్బాన్(23) బైక్ మెకానిక్. కొద్ది రోజుల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో షేక్ అర్బాన్‌కు బాధిత బాలికతో పరిచయం ఏర్పడింది. నిత్యం బాలికతో ఆ యువకుడు చాటింగ్ చేస్తున్నాడు. ఆ తర్వాత ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడుతూ వేధించాడు.

ఈ నెల 24న బాలిక స్కూల్‌కు వెళ్తున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పి.. ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు



ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులు కేసు నమోదు చేసుకుని స్కూల్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా.. బాలిక ఓ యువకుడి బైక్‌పై వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆ బైక్ నంబర్ ఆధారంగా షేక్ అర్బాన్ తీసుకువెళ్లినట్లు పోలీసులు నిర్ధారించి, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి.. గుల్బర్గాలో ఉన్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేశారన్న విషయం తెలుసుకున్న నిందితుడు షేక్ అర్బాస్ భయంతో బాలికను నగరానికి తీసుకొచ్చి, తిరిగి అతడు పారిపోయేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు.

సమాచారం తెలుసుకున్న పోలీసులు నాంపల్లిలో షేక్ అర్బాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చేసిన నేరాన్ని అతడు అంగీకరించాడు. బాలికను పోలీసులు భరోసా సెంటర్‌కు తరలించి, వాంగ్మూలం రికార్డు చేయగా.. గుల్బర్గాలోని ఓ లాడ్జీకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. పోక్సో చట్టం కింద అతడిపై కేసు నమోదు చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేశ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరాగాంధీ చౌరస్తాను అభివృద్ధి చేయాలి

## -కూడలిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ధర్నా

హైదరాబాద్, జూన్ 29 : ఇందిరాగాంధీ చౌరస్తాను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

శుక్రవారం అల్వాల్ సర్కిల్ ఇందిరాగాంధీ చౌరస్తాను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరికి నిరసనగా ఎమ్మెల్యే ధర్నా చేశారు. ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐలు ప్రకాశ్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాజేందర్‌తో కలిసి చౌరస్తాను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చౌరస్తా అభివృద్ధి కోసం కేసీఆర్ నిధులు మంజూరు చేశారన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చౌరస్తాను అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెంటనే చౌరస్తా అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, పరమేశ్, రమేశ్, పుదారి రాజేశ్‌కన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి రెండేండ్ల బాలుడు మృతి



హైదరాబాద్, జూన్ 29 :: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి రెండేండ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో హెచ్ఎండీఏ శాఖ ఆధ్వర్యంలో నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా మధ్యప్రదేశ్‌కు చెందిన రేష్మీ, సురేంద్ర దంపతులు పనిచేస్తున్నారు.

రోజు వారీగా శుక్రవారం వీరు పనిలో నిమగ్నమవ్వగా, వీరి కుమారుడు మానవ్(2) సమీపంలోనే ఆడుకుంటూ..ప్రమాదవశాత్తు నర్సరీ కోసం తీసిన నీటి సంపులో పడి మునిగిపోయాడు. బాలుడిని బయటకు తీసి.. తూంకుంట, అల్వాల్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.

# నేడు టీ హబ్ లో 'సోసియా వుడ్ 2024' సదస్సు

## -హాజరుకానున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు
## -బ్రోచర్ ఆవిష్కరించిన ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ రచమల్లు

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ ).: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సోషియావుడ్ 2024 సదస్సు నిర్వహించనున్నట్లు ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ రచమల్లు తెలిపారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం లో డాక్టర్ విజయ్ భాస్కర్ తో కలసి కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు యొక్క ఈ రెండవ ఎడిషన్‌లో 350 మంది టాప్-క్లాస్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, విశిష్ట అతిథులు ఉంటారని తెలిపారు. ఈ ఈవెంట్‌గా డిజిటల్ కమ్యూనిటీలో ఒక మైలురాయిగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ రావు, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఏడీజీపీ శిఖా గోయల్, డీఐజీ ప్రకాష్ రెడ్డి, ఫేమస్ యాంకర్ సుమ కనకల, యాక్టర్ విరాజ్ అశ్విన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నేడు టీ హబ్, మార్వెల్, 5వ అంతస్తులో ఉ.9 నుండి సా. 6 వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శివ, లిఖిత్ గౌడ్, భార్గవ్, గాయత్రి పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి,అభివృద్ధికి పెద్దపీట.

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి,అభివృద్ధికి పెద్దపీటవేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..శనివారం వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్స్ లో వేములవాడ రూరల్, అర్బన్ మండలాల అర్హులైన 208 మందికి కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమనికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి తో కలసి పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఎన్నికల కోడ్ వల్ల కాస్త ఆలస్యమైందని అన్నారు.

ప్రభుత్వం సామాజిక బాధ్యతగా నిరుపేద బిడ్డలకు వివాహం జరిగినప్పుడు ఏలాంటి ఇబ్బంది తలెత్తకుండా కళ్యాణ లక్ష్మి తోడ్పాటునందిస్తా యన్నారు.. సంక్షేమానికి ఈ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు.. మహిళా తల్లులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు.. గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు..ఇండ్లు లేని వారికి త్వరలోనే వాటి నిర్మాణానికి బీసీలకు ఐదు లక్షలు ఇతరులకు ఆరు లక్షల ఇవ్వడం జరుగుతుందన్నారు... వేములవాడ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు కాబడి ఉన్నాయన్నారు..ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు కూడా కొనసాగిస్తామన్నారు.. ప్రజా ప్రభుత్వంలో మెరుగైన పాలన ప్రజలకు అందిస్తామన్నారు..

# గిరిజన సంక్షేమంపై జాతీయ గిరిజన కమిషన్ సమీక్ష

హైదరాబాద్, జూన్ 29 :రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం హైదరాబాద్‌లోని 'హోటల్ ది ప్లాజా'లో జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఏ శరత్ ఆధ్వర్యంలో శాఖ అధికారులు తమ విభాగాలు చేపడుతున్న వివిధ గిరిజన సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై కమిషన్‌కు వివరించారు.

కమిషన్ సభ్యులు గిరిజన సంక్షేమ శాఖలోని విద్య, మౌలిక వసతుల కల్పన, ట్రైకార్, జీసీసీ, సంస్కృతి తదితర విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న ఆయా పథకాల పురోగతిని గురించి సంబంధిత అధికారులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా పురోగతులపై అధికారులను అభినందించారు. ఇంకా ఇనుమడించిన ఉత్సాహంతో ముందు కెళ్లాలని పలు సూచనలు చేశారు.

సమావేశంలో గురుకులం కార్యదర్శి సీతాలక్ష్మి, గిరిజన శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్, జీసీసీ జీఎం సీతారాం, గిరిజన పరిశోధన సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ వీ సముజ్వల, డాక్టర్ డీ సత్యనారాయణ తదితర ఉన్నతాధికారులు, పలు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఎదురెదురుగా ఢీ కొన్న రెండు కార్లు.. ఏడుగురు మృతి



న్యూఢిల్లీ, జూన్ 29 : మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శుక్రవారం అర్ధరాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

మహారాష్ట్రలోని జల్నా సమీపంలో ముంబై -నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ఫ్యూయల్ రీఫిల్లింగ్ కోసం పెట్రోల్ పంప్ వద్దకు వెళ్లేందుకు ఓ కారు రాంగ్ డైరెక్షన్‌లో వెళ్లడంతో ఈ ప్రమాదం సంభవించింది. రెండు కార్లు ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో ఆ మార్గంలో భారీగా ఏర్పడిన ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి.. : టీజీ భరత్



అమరావతి, జూన్ 29 :కర్నూలు నగరంలోని వీధుల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో పాటు కర్నూలు సమీపంలోని జగన్నాథం కట్టపై ఉన్న టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టిజి భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం టిడ్కో, శానిటేషన్ సంబంధిత అధికారులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోని వీధుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్త సేకరణపై చర్చించారు.

ప్రతి రోజూ క్రమం తప్పకుండా కాల్వలు శుభ్రం చేయాలన్నారు. తమ ఫ్యాక్టరీ నుండి ఉచితంగా అందజేస్తున్న హైపో ద్రావణాన్ని తీసుకొని వీధుల్లో పిచికారీ చేయాలని ఆదేశించారు. ఏ రోజు ఎక్కడెక్కడ హైపో ద్రావణం పిచికారీ చేస్తున్నారో రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు సక్రమంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య విభాగంలో సరైన సిబ్బంది లేకపోవడం, ఆర్థిక వనరుల కొరత ఉందన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతానని, అవసరం అయితే మున్సిపల్ శాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి టి.జి భరత్ తెలిపారు.

కర్నూలు నగర సమీపంలోని జగన్నాథ గట్టుపై 10 వేల టిడ్కో గృహాలు మంజూరైనాయని ఈ గృహాల కొరకు అర్హులైన వారి వివరాలను వార్డువైజుగా లిస్ట్ తయారు చేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గృహాలు పూర్తికావడానికి ఇంకా ఎంత నిధులు అవసరమని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.త్వరితగతిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలు గృహాల్లో నివసించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ ఈ రాజశేఖర్, మున్సిపల్ ఎంహెచ్‌వో విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో నాలుగు రోజులు వానలు..!

హైదరాబాద్, జూన్ 29 : తెలంగాణలో మరో నాలుగురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదివారం నుంచి బుధవారం వరకు బలమైన, స్థిరమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళా ఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఆవర్తనం ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరం వద్ద వాయువ్య బంగాళాఖతంలో అల్పపీడనం ఏర్పడిందని.. ఇది సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

# దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు.. చిల్లర మార్కెట్‌లో 60 శాతం పెరుగుదల

## -ఆకుకూరలకూ రెట్టింపు డిమాండ్
## -ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలపై దృష్టి
## -ఆర్‌కేవీవై సబ్సిడీ పునరుద్ధరించాలని రైతుల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 29 :: రాష్ట్రంలో కూరగాయల ధరలు దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల మందగమనం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గిపోవడం కూరగాయల దిగుబడులపై తీవ్రంగా ప్రభావం చూపించింది. ఫలితంగా రైతుబజార్లతో పోలిస్తే చిల్లర మారెట్‌లో ఏకంగా 60 శాతం వరకు ధరలు అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది.

సాధారణంగా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతాయి. వర్షాకాలం మొదలవగానే మళ్లీ తగ్గుతుంటాయి. కానీ ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సీజన్‌లో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. వర్షాకాలం మొదలయ్యాక, వర్షాభావ పరిస్థితుల నడుమ నగరం, పట్టణం, గ్రామం అన్న తేడాలు లేకుండా 20రోజుల వ్యవధిలోనే అమాంతంగా ధరలు పెరిగాయి.

తగ్గిన కూరగాయల సాగు

తెలంగాణ జనాభాకు ప్రతి ఏటా 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరం. ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో ఒక కోటి 31లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన ఆహార పంట వరి సహా పత్తి, మొకజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కంది, పెసర, ఇతర చిరుధాన్యాలు వంటి అన్ని రకాల పంటలు సాగవుతుండగా, అందులో కూరగాయల పంటలు 3.11లక్షల ఎకరాలకే పరిమితం అయ్యాయి. ఈ కారణంగా సుమారు 19 లక్షల టన్నుల దిగుబడుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ వేసవిలో స్థానికంగా కూరగాయలు ఉత్పత్తి 25 శాతం తగ్గిపోయింది.

అకాల వర్షాలతో ప్రభావం

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులు కూరగాయలు, ఆకుకూరల తోటలను దెబ్బతీశాయి. హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి, నల్గొండ తదితర జిల్లాల్లో కూరగాయల దిగుబడులు తగ్గడంతో ఇతర రాష్ట్రాల నుంచి తెస్తున్నారు. ఫలితంగా కూరగాయల ధరలపై రవాణా భారం కూడా పడుతున్నది. జనాభా అవసరాలకు తగ్గట్టుగా కూరగాయల సాగు పెరగాలంటే ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఆర్‌కేవీవై సబ్సిడీ పునరుద్ధరణ

ఆర్ (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) కింద రైతులకు 50 శాతం రాయితీపై అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రీడ్ వంగడాలు, రసాయన ఎరువులను ప్రభుత్వం అందజేసేది. రాయితీలు, రుణాలను ఇచ్చి ప్రోత్సహించేది. వాటిని పునరుద్ధరిస్తే కూరగాయల సాగు పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

# వాసిరెడ్డి శ్రీనివాస్, కొంతమందితో మాకు ప్రాణహాని ఉంది

## - బాధిత మహిళల ఆరోపణ

ఖమ్మం, జూన్ 29 :(నేటినిజం ప్రతినిధి): సిపిఎం నాయకులు ఎస్ కె.మీరా, మరి కొందరు కిరాయి రౌడీ ముకలు మా పై శనివారం ఉదయం దౌర్జన్యం చేశారని బాధితులు చేపూరి సంధ్యారాణి, నైనిషా ఒక ప్రకటనలో ఆరోపించారు. తాము గత 13 సంవత్సరాలుగా ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలని రోడ్ నెంబర్-15 లో ఇంటి నెంబర్ 16-9-164/2/ఏ/1. ఇంట్లో నివాసం ఉంటున్నాం. మాకు సర్వే నెంబర్ 494 వెలుగుమట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని 2 ఎకరాల 10 గుంటల భూమి స్థలం ఉన్నది. వాసిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ భూమి తమదే అని, డాక్యుమెంట్స్ తమకే ఉన్నాయి... అంటూ సిపియం సినియర్ నాయకులు ఎస్ కె.మీరా మరికొందరు కిరాయి గుండాలు సుమారు 100 మందితో శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో జేసీబీలతోవచ్చి, దౌర్జన్యంగా మా భూమిని చదును చేసేందుకు ప్రయత్నించగా ఈ క్రమంలో మేము ఇద్దరం అక్కా-చెల్లెళము అయిన సంధ్యారాణి, నైనిషా లము... మా భూమి మీదకు ఎందుకు వచ్చారు. మీరు ఎవరు అని అడిగితే ఇష్ట వచ్చినట్లు భూతులు తిడుతూ, మమల్ని తాకరాని ప్రదేశంలో తాకుతూ మహిళలు అని కూడా చుడకుండా జుట్టు పట్టుకోని కొడుతూ, తన్నుతు, చున్నిలని లాగి బాలింత అని చెప్పినా వినకుండా చంపుతాము, యాసిడ్ పోయండి అని బెదిరించి కోట్టి మా ఫోన్ తీసుకోని కిడ్నప్ చెయ్యాలని కార్ లో ఎక్కించే ప్రయత్నం చేసారు. కాగా మేము తప్పించుక్కున్నామనీ జారీ చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ కే.మీరా అనే సిపిఎం సీనియర్ నాయకులు మాతో మాట్లాడుతూ...పోలీస్ వారు మాకు కొన్ని సూచనలు చేసారు. వాళ్ళు ఫోటోలు, వీడియోలు తీస్తారు, ఫోన్లు తీసుకోని వచ్చి మాకు ఇయ్యమ్మన్నారనీ మాతో అన్నారు. ఈ స్థలం మీద హైకోర్ట్ ఆర్డర్, రిట్ ఉన్నాయి. ఎఫ్ఎస్ఎల్ ఆర్డర్ కూడా మాకు అనుకులంగా వస్తే అధికార దుర్వినియోగానికి పాల్పడి వారికీ అనుకూలంగా ఆర్డర్స్ ని సృష్టించుకోని మా భూమి మీదికి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారనీ బాధిత మహిళలు తమ ప్రకటనల్లో పేర్కొన్నారు. మాకు ఈ వ్యక్తుల నుండి వాసిరెడ్డి శ్రీనివాస్, కోన గోవింద్ రావు, తమరప్పు లక్ష్మన్, మీగడ రామ క్రిష్ణ, పెరుగు వెంకటరమణ యాదవ్, పి.రమ్య, ఐద్వా మహిళా నాయకురాలితో పాటు మరికొంత మంది నుంచి మాకు ప్రాణభయం వుంది. కావున మా యందు దయఉంచి మాకు రక్షణ కల్పించాలని, కాపాడాల్సిందిగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్లో బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు జులై 4 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, జూన్ 29 : రాష్ట్రంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. జులై 4 నుంచి 8వ తేదీ వరకు టీజీపీఎస్సీ కార్యాలయంలో ఎంపిక చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తేదీ నుంచి 8 వరకు ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. జులై 3వ తేదీ నుంచి ఆప్షన్స్‌కు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

గతేడాది జులై నెలలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. క్లాస్-ఏలో 170, క్లాస్-బీలో 15 ఉద్యోగాలకు 1,172 మంది దరఖాస్తు చేసుకొన్నారు. క్లాస్-ఏ ఉద్యోగాలకు ఉదయం పేపర్-1 పరీక్షకు 835 మంది హాజరయ్యారు. పేపర్-2ను 810 మంది రాశారు. క్లాస్-బీ ఉద్యోగాల నియామక పరీక్షకు 103 మంది హాజరయ్యారు.

# గో బ్యాక్ ఎమ్మెల్యే కాలె యాదయ్య.. వికారాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తల నిరాహార దీక్ష



హైదరాబాద్, జూన్ 29 :చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడాన్ని స్థానిక హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. కాలె యాదయ్య చేరికను నిరసిస్తూ వికారాబాద్ జిల్లా నవాబుపేటలో మండల కాంగ్రెస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, కార్యకర్తలు నిరాహార దీక్షకు దిగారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించిన కాలె యాదయ్య.. ఇప్పుడు అదే పార్టీలో చేరడం హాస్యాస్పదంగా ఉందని ఈ సందర్భంగా కొండల్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఆయన గతంలో అనేక కేసులు పెట్టించాడని గుర్తుచేశారు. యాదయ్య చేరిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్యను సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వద్దకు తీసుకెళ్లి పార్టీ కండువా కప్పించారు. కాగా, పార్టీని వీడుతున్న కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీని వీడి దొంగలతో కలిసేటోళ్ల గురించి బాధలేదని.. తెలంగాణ సాధించిన మనకు గిదో లెక్కనా? అని వ్యాఖ్యానించారు. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప.. నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనే అని తెలిపారు. మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తదని చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# రాజమహేంద్రవరం ఎంపిఎల్ ప్రైమరీ పాఠశాలలో మా చిన్ని స్టార్స్ సందడి



రాజమహేంద్రవరం, జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స); ? వినోదం మరియు అభ్యాసం తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో, రాజమహేంద్రవరం లోని తుమ్మలవా ఎంపిఎల్ ప్రైమరీ పాఠశాల లో ఈ రోజు "మా చిన్ని స్టార్స్" స్టూడెంట్స్ తో కలిసి సందడి చేశారు. ఈ ఉత్సాహభరితమైన సందర్భంగా పాఠశాల ప్రాథమిక విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త టీవీ షో "చిన్ని"లోని ప్రియమైన పాత్రలైన చిన్ని మరియు కావేరితో ఆడి పాడారు. చిన్ని మరియు కావేరి సన్నిధి పిల్లలతో కలిసి ఉల్లాసంగా మరియు ఆనందాన్ని కలిగించే వాతావరణాన్ని సృష్టించింది, ఈ రోజును చిరస్మరణీయమైనదిగా మరియు విద్యావంతం చేసింది. విలువైన జీవిత పాఠాలను అందించడానికి రూపొందించిన వరుస ఆకర్షణీయమైన గేమ్‌లతో చిన్ని యువ ప్రేక్షకులను ఆకర్షించింది. ఈ ఉల్లాసభరితమైన వాతావరణంలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులు చెపింది వినడం, వారి తల్లిదండ్రులను గౌరవించడం, పరీక్షలలో ఉతీరణ సాధిచడం పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా "తల్లి మరియు బిడ్డ" అనే అంశంపై జరిగిన పెయింటింగ్ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల కళాత్మక తో తల్లులు మరియు వారి పిల్లల మధ్య ప్రేమ మరియు బంధాన్ని అందంగా చిత్రీకరించాయి, కుటుంబాలు కలిసి భోజనం చేయడం, ఆప్యాయత ప్రదర్శించడం మరియు విలువైన క్షణాలను పంచుకునే దృశ్యాలను ప్రదర్శిస్తారు. విజేతలకు భాష మరియు అభ్యాసంపై వారి ప్రేమను పెంపొందించడం ద్వారా ఆక్స్‌ఫర్డ్ బుక్ ను ప్రదానం చేశారు."చిన్ని" సీరియల్ జూలై 1 నుండి స్టార్ మాలో రానుంది, ప్రతి రోజు సోమవారం నుండి శనివారం వరకు రాత్రి 7 గంటలకు ప్రసారం అవుతుంది. చిన్ని కొత్త సాహసాలను ఎదుర్కొంటూ, అర్థవంతమైన సంబంధాలను ఏర్పరుచుకుని, తన తల్లిని జైలు నుండి విడిపించడానికి ప్రయత్నించే చిన్ని యొక్క జైలు గోడలపై సాగే ప్రయాణంపై కథ సాగుతోంది.

# ప్రేమకు అడ్డు వస్తున్నాడని స్నేహితుడిని చంపిన ఇంటర్ విద్యార్థి

హైదరాబాద్, జూన్ 29 : తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని చెప్పి.. స్నేహితుడిని ఓ ఇంటర్ విద్యార్థి హత్య చేశాడు. ఈ హత్యను రైలు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులకు నిందితులు అడ్డంగా దొరికిపోయారు.వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 23వ తేదీన మూసాపేట వద్ద రైలు పట్టాలపై డానీష్(17) అనే ఇంటర్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. దీంతో డానీష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, తన కుమారుడు హత్యకు గురయ్యాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.డానీష్ సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నెల 22న రాత్రి 9.30 గంటలకు డానీష్‌కు స్థానిక రౌడీషీటర్ కుమారుడు(17) ఫోన్ చేసినట్లు విచారణలో తేలింది. ఇక మద్యం సేవించిన రౌడీషీటర్ కుమారుడు తన 8 మంది స్నేహితులతో కలిసి డానీష్‌పై బీరు సీసాలతో దాడి చేసి చంపారు. అనంతరం డెడ్‌బాడీని రైలు పట్టాలపై పడేసి వెళ్లిపోయారు నిందితులు. తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని డానీష్‌పై రౌడీషీటర్ కుమారుడు పగ పెంచుకున్నాడని, ఈ క్రమంలో హత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. నిందితులు యూసుఫ్‌గూడలోని ఓ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మెదక్, జూన్ 29 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గుమ్మడిదల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం- గుమ్మడిదల బస్టాండ్ ఆవరణలో 30నుంచి 35ఏళ్లలోపు వయసు గల మగ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు.

సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి పరిశీలించగా.. వ్యక్తి చనిపోయి ఉన్నట్టుగా నిర్ధారించడం జరిగింది.

శవం కుడి చేతిపై త్రిశూలం ఆకారంలో పచ్చబొట్టు కలదు. ఈ వ్యక్తి గురించి ఎలాంటి సమాచారం తెలిసినా ఈ కింది ఫోన్ నంబర్లను సంప్రదించవలసిందిగా వారు సూచించారు.

సిఐ జిన్నారం-8712656730, ఎస్ఐ గుమ్మడిదల-8712656751లను సంప్రదించాలన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.